# అబద్ధంకాదు నిజం

అది మైలాపూరులోని ఒక తెలుగు కొంప. ఆ ఇంటి యజమానురాలు చాలా పూర్వకాలపు మనిషి – అంటే మంచిదన్నమాట.

ఆవిడ పేరు మంగమ్మ. తన ఇంటికివచ్చే దాసీవాళ్ళ పేర్లు సాధారణంగా రుక్మిణి, ధనలక్ష్మి, అంబుజం, లక్ష్మి, పార్వతి మొదలయినవిగా వుంటూంటాయి——ఇంటి యజమానురాలే మంగమ్మగా తృప్తిపడి వూరుకుంటే ఈ దాసీముండలు అంతంత పేర్లెట్టుకుని అలా మిడిసిపడతారేం?

మంగమ్మకి వాళ్ళనిచూస్తే అరికాలిమంట నెత్తికెక్కింది.

దీనితోడు నీళ్ళ సంగీతాలు! ఇంతంతలేసి ముండకీ సంగీతం! పాటలు! కూనిరాగాలు! ఇన్నాళ్ళు వచ్చికూడా తను ఒక్కపాట– ఒక్కటంటే ఒక్కపాట– ఎప్పుడేనా పాడిందా? అసలు తనకు పాడటమే చేతగాందే?

అందర్నీ మానిపించేసింది మంగమ్మ. ఆ మర్నాడు ఇంకోపిల్ల వచ్చింది. ఇది కొంచెం నెమ్మదైనదే.

'నీ పేరెవరు?'

'కృష్ణవేణి.'

ఆ దెబ్బతో సగం చచ్చింది మంగమ్మ. తెగించి మరో ప్రశ్న వేసింది.

'ఆ మెళ్ళోవున్న చెయిను నీ కెట్లా వచ్చిందీ?'

'రేడియోలో పాడితే యిచ్చారు.' మంగమ్మ ముఖం ఎర్రబడింది.

'నేనైతే తలగొరిగించి ఇంటిలో కూచోబెడుదును – నీకు సాయం రేడియోలో పాట ఒకటా – పద శీఘ్రం అవతలికి పద. ఇంక నేను దాసీదాన్ని పెట్టుకుంటే ఒట్టు.'

---

యం. యస్. మూర్తి

---